ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
శనివారం | 08 ఆగస్టు , 2026 | పేజీలు :7



మోదీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలే ప్రశ్నించాలి

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

### జిల్లా అధికారులకు కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశం



**ప్రజాపక్షం/నల్లగొండ :** ఆగస్టు 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ జిల్లా అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.ముఖ్య అతిథి ప్రసంగానికి అవసరమైన శాఖల నివేదికలను ఈ నెల 10వ తేదీలోగా సమర్పించాలని సూచించారు. అలాగే, ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రదానం చేయనున్న ప్రశంసాపత్రాల కోసం ఆయా శాఖలు 11వ తేదీలోగా పేర్లను పంపించాలని ఆదేశించారు.ప్రతి ఏడాదిలాగే అన్ని ప్రధాన శాఖలు తమ ప్రగతిని ప్రతిబింబించేలా శకటాలను (టాబ్లోలు) ఏర్పాటు చేయాలని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల అనంతరం సాయంత్రం ఎస్ఎల్‌బీసీ వద్ద నూతనంగా నిర్మించిన పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవంతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు చెప్పారు.జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించే ప్రతి ఒక్కరూ జాతీయ పతాక నియమావళిని తప్పనిసరిగా పాటించాలని,ప్లాస్టిక్ జెండాలు ఉపయోగించవద్దని, అలంకరణలో కూడా ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం జిల్లాలో వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసుల పురోగతిని సమీక్షించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్, జడ్‌పి సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి,డీఆర్‌ఓ దశరథ్, డీఆర్‌డీఓ శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

**పారదర్శక ఓటరు జాబితా రూపొందించడమే ఉద్దేశం**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా పారదర్శక ఓటరు జాబితా రూపొందించడమే ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి బి.చంద్ర శేఖర్ అన్నారు. సర్ కార్యక్రమంలో భాగంగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ,సర్ ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్,తదితర అంశాలపై శుక్రవారం ఆయన కలెక్టర్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.సరించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 25,2026 నుండి ఆగస్టు 10 వరకు బిఎల్ ఓ ల ఇంటింటి సందర్శన ఉంటుందని,10 న పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ,ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ,17 నుండి సెప్టెంబర్ 16 వరకు నెల రోజులపాటు ముసాయిదా ఓటరు జాబితా పై అభ్యంతరాల స్వీకరణ,ఆగస్టు 17 నుండి అక్టోబర్ 15 వరకు అభ్యంతరాల పరిష్కారం ఉంటాయని, అక్టోబర్ 19న తుది ఓటరు జాబితా ప్రచురించడం జరుగుతుందని కలెక్టర్ ప్రజాప్రతినిధులకు వివరించారు.ఆర్‌డిఓలు వై. అశోక్ రెడ్డి, శ్రీదేవి ,పద్మప్రియలు వారి డివిజన్లకు సంబంధించి ఇప్పటివరకు సర్ డిజిటలైజేషన్ ప్రక్రియ, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ సమాచారాన్ని తెలియజేశారు.

# సాగర్‌కు స్వల్ప వరద..

### ఒక్క అడుగు పెరిగి 514 అడుగులకు చేరిన రిజర్వాయర్ నీటిమట్టం





**ప్రజాపక్షం/నందికొండ:** ఎగువ ప్రాంతాల నుంచి కృష్ణానదికి భారీగా వరద ప్రవాహం కొనసాగుతుండటంతో నాగార్జునసాగర్‌లోకి కూడా వరద నీరు నెమ్మదిగా చేరుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి విద్యుత్ ఉత్పత్తి ద్వారా విడుదలవుతున్న నీరు సాగర్‌కు చేరుతుంది. ఎగువ ప్రాంతాల్లో వరద ఉధృతి మరింత కొనసాగితే రానున్న రోజుల్లో సాగర్‌కు వరద ప్రవాహం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.గత కొన్ని రోజులుగా 513 అడుగుల వద్ద స్థిరంగా ఉన్న సాగర్ నీటిమట్టం.. స్వల్పంగా కొనసాగుతున్న వరద ప్రవాహంతో ఒక్క అడుగు పెరిగి 514 అడుగులకు చేరి 138.2126 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది.ఇందులో దాదాపు 138 టీఎంసీలు డెడ్ స్టోరేజీ కాగా,మిగిలిన నీటిని తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ప్రధానంగా తాగునీటి అవసరాలకు వినియోగిస్తున్నాయి.

**శ్రీశైలం గేట్లు ఎత్తితే భారీగా వరద**

ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద ప్రవాహం కొనసాగుతున్న నేపథ్యంలో ఆదివారం శ్రీశైలం గేట్లు ఎత్తే అవకాశం ఉన్నట్లు సమాచారం. గేట్లు ఎత్తి భారీగా నీటిని దిగువకు విడుదల చేస్తే నాగార్జునసాగర్‌కు సుమారు 2 లక్షల క్యూసెక్కుల వరకు వరద ప్రవాహం చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.ఈ స్థాయిలో వరద ప్రవాహం సుమారు పది రోజుల పాటు కొనసాగితే నాగార్జునసాగర్ 80 శాతానికి పైగా నిండే అవకాశం ఉందని అంచనాలు వ్యక్తమవుతున్నాయి.దీంతో ప్రస్తుతం సాగర్ ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

**పది రోజులే కీలకం**

ముఖ్యంగా రానున్న పది రోజుల్లో నాగార్జునసాగర్‌కు ఎంతమేర వరద చేరుతుందనేది అత్యంత కీలకంగా మారింది. ఈ వ్యవధిలో సుమారు 150 టీఎంసీల అదనపు నీరు సాగర్‌కు చేరితే ఆయకట్టు పరిధిలో ఆరుతడి పంటలకు నీటి కొరత ఉండదనే అంచనాలు పెరుగుతున్నాయి.

అయితే సాగునీటి విడుదలకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన ప్రణాళికను ప్రకటించలేదు. దీంతో సాగర్ ఆయకట్టు రైతులు రానున్న రోజుల్లో ప్రాజెక్టుకు చేరే వరద, నీటి నిల్వలు, సాగునీటి విడుదలపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# విద్యే ఆదివాసీ సమాజ అభ్యున్నతికి బలమైన ఆయుధం

### విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

### ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

**ప్రజాపక్షం/దేవరకొండ;** ఆదివాసీలు ప్రకృతిని ఆరాదిస్తూ తమ ప్రత్యేక సంస్కృతి సాంప్రదాయాలు, భాషలను వేల ఏళ్లుగా కాపాడుకుంటూ వస్తున్న గొప్ప సమాజమని వారి చరిత్రను వారసత్వాన్ని భావితరాలకు పరిచయం చేయడమే ఇతిహాస్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం అని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలు నాయక్ అన్నారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మండలంలోని మైనంపల్లి గ్రామ పరిధిలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల (మహిళల)లో నిర్వహించిన ఇతిహాస్ కార్యక్రమంలో ఎంఎల్‌ఏ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవం అనేది కేవలం ఒక వేడుక మాత్రమే కాదని ఆదివాసీల చరిత్ర, సంస్కృతి, జీవన విధానం, ప్రకృతితో వారి అనుబంధాన్ని ప్రపంచానికి చాటిచెప్పే గొప్ప సందర్భమని అన్నారు. ఆదివాసీలు ప్రకృతిని దేవతగా భావించి అడవులు, కొండలు, నదులను పరిరక్షిస్తూ ప్రకృతితో మమేకమై జీవించే గొప్ప జీవన తత్వాన్ని ప్రపంచానికి అందించారని ఎంఎల్‌ఏ కొనియాడారు. నేటి తరానికి ఆదివాసీల జీవన విలువలు, ప్రకృతి పరిరక్షణ పట్ల వారి బాధ్యత, సామాజిక ఐక్యత స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో తెలంగాణ గిరిజన గురుకుల కార్యదర్శి సీతాలక్ష్మి , డిప్యూటి సెక్రటరీ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్‌సివో శ్రీనివాస్‌రాయ్, ప్రిన్సిపాల్ హరిప్రియ, మైనంపల్లి సర్పంచ్ కొర్ర రాంసింగ్, వైస్ ప్రిన్సిపాల్ శ్వేత పాల్గొన్నారు.

# 10న వరుణ యాగానికి సిఎం రాక..

### ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నందికొండ :** ఈ నెల 10న నాగార్జునసాగర్ సమీపంలోని విజయ విహార్‌లో నిర్వహించనున్న వరుణ యాగానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి హాజరుకానున్నారనే ప్రాథమిక సమాచారం నేపథ్యంలో జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ శుక్రవారం విజయ విహార్‌ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.యాగం నిర్వహించే యాగశాల,ప్రవచన మండపం,వసతి,భద్రత తదితర అంశాలపై దేవాదాయ,రెవెన్యూ,పోలీసు తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.సీఎం పర్యటన దృష్ట్యా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.యాగానికి రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు మంత్రులు,ఎంపీలు, ఎమ్మెల్సీలు,ఎమ్మెల్యేలు,ఇతర ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరుకానున్న నేపథ్యంలో వారికి ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు,సాధారణ భక్తులు సైతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా యాగాన్ని వీక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ పరిశీలనలో అదనపు ఎస్‌పి రమేష్,మిర్యాలగూడ ఆర్‌డిఓ రమణారెడ్డి, యాదాద్రి దేవస్థానం డిప్యూటీ ఈవో డి. భాస్కర్,జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కే. భాస్కర్, డీఎస్‌పి రవి, ఆర్‌ఐ శ్రీనివాస్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.



## పిఆర్‌టియు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల నియామకం

**ప్రజాపక్షం/మునగాల:** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పిఆర్‌టియుఎస్ పోరాడుతుందని పిఆర్‌టియు జిల్లా నాయకులు తంగెళ్ల జితేందర్‌రెడ్డి, తీగల నరేష్ లు తెలిపారు. శుక్రవారం పిఆర్‌టియు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పిఆర్‌టియుఎస్ మండల అధ్యక్షునిగా అడిదల వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సుల్తాని శంకర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అసోసియేట్ అధ్యక్షులుగా బజ్జూరి శ్రీకాంత్‌రెడ్డి, మహిళ అసోసియేట్ అధ్యక్షులు ఎర్రమాల జ్యోతి, ఉపాధ్యక్షులు నాగార్జునపు రాము, మహిళ ఉపాధ్యక్షులుగా సామినేని జ్యోతి లను, కార్యదర్శులుగా ఇరుగు కిరణ్‌కుమార్, అల్వాల సతీష్, మహిళ కార్యదర్శులుగా భూతం జ్యోతి, శిఖకోలా ఉపేంద్రమ్మలను ఎన్నుకున్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 14వ వార్డు కౌన్సిలర్ సరికొప్పుల విజయలక్ష్మి, నాగేశ్వరరావు సౌజన్యంతో శుక్రవారం పట్టణంలో ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు షేక్ యూసఫ్, జిల్లా చైర్మన్ లయన్ చల్లా ప్రభాకర్‌రెడ్డి లు మాట్లాడుతూ పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలనే గొప్ప ఆశయంతో లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చామంతి, వైద్య సిబ్బంది రాజు, సరిత, గుండా సత్యనారాయణచారి, వెంకటేశ్వర్లు, లాయర్ విశ్వనాథం, కొప్పులక్ష్మి నారాయణ, రూపావత్ బాలు, మహేంద్ర, భరత్, అంజి పాల్గొన్నారు.

## నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటి, రాష్ట్ర స్టీరింగ్ కమిటి పిలుపు మేరకు ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన నాలుగు దశల ఉద్యమ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని, పెండింగ్ డిఎలను మంజూరు చేయాలని, విద్యాశాఖలో పర్యవేక్షణ పోస్టులను భర్తీ చేయాలన్నారు. రేషనలైజేషన్ జీవో 25 సవరించాలని, తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూఎస్పి ఎసి స్టీరింగ్ కమిటి సభ్యులు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, టిఎస్‌యూటిఎఫ్ నాయకులు రషీద్‌ఖాన్, వెంకటేశ్వరరావు, నెమ్మాది వెంకటేశ్వర్లు, నర్సింహరావు, రామ్మూర్తి పాల్గొన్నారు.



## చట్టసభల్లో బిసిలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలి




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కేంద్ర ప్రభుత్వం తక్షణమే బీసీ కులగణన చేపట్టి, చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు యూనివర్సిటీలోని జ్ఞాన జ్యోతి ఆడిటోరియంలో జరిగిన జాతీయ ఓబీసీ 11వ మహాసభలో ఉమ్మడి నల్గొండ జిల్లా బీసీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను దిగ్విజయం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం బెంగళూరులో లింగంగౌడ్ మాట్లాడుతూ దేశంలో వెనుకబడిన వర్గాల హక్కుల సాధనకు పోరాటాలు ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మండల్ కమిషన్ సిఫార్సులను అమలులోకి తెచ్చిన ఆగస్టు 7వ తేదీని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం దేశంలో జాతీయ ఓబీసీ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఏపీ నుండి యూపీ వరకు పది మహాసభలను విజయవంతంగా పూర్తి చేసుకుని, ఈసారి 11వ మహాసభను బెంగళూరులో నిర్వహించినట్లు వెల్లడించారు. దేశంలో ఎస్సీ, ఎస్టీ జనాభాను లెక్కిస్తున్న కేంద్ర ప్రభుత్వం, బీసీల కులగణన చేయడానికి మాత్రం ముందుకు రాకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి దుర్గయ్య, బుజ్జ కృష్ణ, పానుగంటి విజయ్, బంటు కవిత, మల్లికార్జున యాదవ్, మధు యాదవ్, నిద్ర సంపత్ నాయుడు, నక్క నాగరాజు, అనంతుల సాయి, నందగోపాల్, తుపాకుల తుఖారాం పాల్గొన్నారు.

## సాగర్ ఎడమకాలువకు నీళ్లు వదిలి చెరువులు నింపాలి

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** వర్షాభావ పరిస్థితుల్లో నాగార్జునసాగర్ ఎడమకాలువ పరిధిలోని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున ప్రభుత్వం వెంటనే సాగర్ ఎడమకాలువకు నీటిని విడుదల చేసి చెరువులు నింపాలని, తాగునీరు, సాగునీటి అవసరాలను తీర్చాలని నాగార్జునసాగర్ ఆయకట్టు పరిరక్షణ సమితి వ్యవస్థాపక సభ్యుడు సప్పిడి శంభిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండల కేంద్రంమైన గరిడేపల్లిలో ఆయన విలేకరులతో రైతులనుద్దేశించి మాట్లాడుతూ ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో భూగర్భజలాలు పూర్తిగా అడుగంటిపోయాయని, బోర్లు, బావులు, ఎండిపోవడంతో గ్రామీణ ప్రజలు తీవ్ర నీటి కొరతను ఎదుర్కొంటున్నారని వ్యక్తం చేశారు. సాగర్ ఎడమకాలువకు వెంటనే విడతల వారిగా నీటిని విడుదల చేసే మార్గమధ్యంలోని చెరువులు, కుంటలు నింపితే భూగర్భజలాలు పెరిగి తాగునీటి సమస్య రాకుండా పరిష్కారమవుతుందని సూచించారు. ఉన్నతాధికారులు స్పందించి సాగర్ ఎడమకాలువకు నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలు నింపాలని కోరారు.

## నిరుపయోగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల



**ప్రజాపక్షం/నడిగూడెం:** మండలంలోని కరివిరాల గ్రామంలో ఉన్నటువంటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు క్రమక్రమంగా తగ్గిపోవడం ఆ గ్రామంలోనే మోడల్ స్కూల్ ఉండటంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొత్తగా చేరే విద్యార్థులు లేకపోవడంతో 2022 సంవత్సరంలో పాఠశాలను మూసివేయడం జరిగింది. గత నాలుగు సంవత్సరాలుగా పాఠశాల నిరూపయోగంగా ఉంటుంది. పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు, విద్యార్థులు లేకపోయేసరికి డిప్యూటేషన్‌పై వేరే పాఠశాలకు వెళ్లారు. నాలుగు సంవత్సరాలుగా పాఠశాల నిర్వహణ లేకపోవడం వల్ల ప్రాంగణం అంతా పిచ్చిమొక్కలతో నిండిపోయింది. రాత్రి వేళ్లలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. శుక్రవారం ఉదయం బిసి సంక్షేమ శాఖ అధికారులు విశాల్ దార, డివిజనల్ అధికారి వంశీ, నడిగూడెం వార్డెన్ లతీమూన్ పాఠశాలను పరిశీలించారు. బాలుర వసతి గృహం ఏర్పాటుకు భవనం అనుకూలంగా ఉందా అనే అంశంపై స్థల పరిశీలన, ప్రహరిగోడ నిర్మాణం, భద్రత ఏర్పాట్లు, విద్యుత్, తాగునీటి వంటి మౌళిక సదుపాయాలను పరిశీలించారు. సంబంధిత వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి బిసి బాలుర వసతిగృహం ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## సూర్యాపేటలో రైల్వే కోసం విద్యార్థుల ర్యాలీ

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేటకు రైల్వే లైన్ సాధించాలన్న ఆకాంక్ష విద్యార్థుల నినాదాలతో మరోసారి మార్మోగింది. రైల్వే సాధన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన విద్యార్థుల భారీ ర్యాలీ ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా సాగింది. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సూర్యాపేటకు రైల్వే లైన్ కావాలని, ఇచ్చిన రైల్వే లైన్‌ను మార్చడం సిగ్గు సిగ్గు, రైల్వే ఉద్యమానికి ప్రజలంతా మద్ధతివ్వాలి, రైల్వే కోసం స్థిరంగా పోరాడుతాం, రైల్వే ఉద్యమం వర్ధిల్లాలి అంటూ చేసిన నినాదాలతో పట్టణ వీధులు మార్మోగాయి. శుక్రవారం పట్టణంలోని ఎల్ఐసి భవనం వద్ద ప్రముఖ విద్యావేత్త, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొల్లు మధుసూదన్ రావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ కొత్తబస్టాండ్ మీదుగా వాణిజ్యభవన్ వద్దకు సాగిన ర్యాలీ అనంతరం సభ నిర్వహించారు. రైల్వే సాధన సమితి కన్వీనర్ దేగల జనార్ధన్ అధ్యక్షతన జరిగిన సభలో పలువురు నాయకులు మాట్లాడుతూ సూర్యాపేటకు రైలు రావడం ఈ ప్రాంత ప్రజల న్యాయమైన హక్కని వక్తలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు శివకుమార్, మండారి డేవిడ్ కుమార్, డాక్టర్ రమేష్ చంద్ర, రాచూరి ప్రతాప్, కె. ధర్మార్జున్, వి. రామ్మూర్తి, డాక్టర్ కె. రంగారెడ్డి, యామా ప్రభాకర్, కొత్తపల్లి రేణుక, మామిడి అంజయ్య, తీకుళ్ల సాయిరెడ్డి, చలపతిరావు, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.





## చదువుతోనే సమాజంలో గుర్తింపు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కష్టపడి చదివే గుణం, నిర్దేశించుకున్న లక్ష్యం వైపే పయనించే పట్టుదల ఉంటే ప్రతీ విద్యార్థి సమాజంలో ఉన్నతమైన స్థానాలను సులభంగా దక్కించుకోవచ్చని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు పరిధిలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విద్యార్థుల నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమంలో ఆయన స్థానిక కౌన్సిలర్ నూకల కవిత వేణుగోపాల్‌రెడ్డితో కలసి పాల్గొని ఉచితంగా పుస్తకాలను అందజేశారు. కళాశాల విద్యార్థులకు పుస్తకాలు అందించిన అనంతరం మాట్లాడుతూ ప్రతీ ఒక్కరి భవిష్యత్తును సరైన దారిలో నిలబెట్టే శక్తి ఒక్క విద్యకే ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ధర్మా నాయక్, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టుల ప్రాబల్యం పెరుగుతోంది



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు భావజాలం, ప్రాబల్యం రోజురోజుకూ పెరుగుతోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. పట్టణంలో పార్టీ నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశం రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లేష్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం సర్వేల పేరుతో సామాన్యుల ఓట్లను తొలగించేందుకు కుట్ర పన్నుతోందని, ఈ చర్యలను తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ హామీలతో అధికారంలోకి వచ్చి, తీరా పీఠం ఎక్కాక కొద్ది హామీలను మాత్రమే నెరవేర్చి ప్రజలను దగా చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 10న నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి కోరారు. కార్యక్రమంలో వీరేపల్లి వెంకటేశ్వర్లు, రాగిరెడ్డి మంగారెడ్డి, రవినాయక్, వినోద్‌నాయక్, శశిధర్‌రెడ్డి, వరలక్ష్మి, మల్లు గౌతమ్‌రెడ్డి, భావండ్ల పాండు, ఎర్రనాయక్, సైదులు, అరుణ పాల్గొన్నారు.

## క్రీడలతో శారీరక మానసిక వికాసం

**ప్రజాపక్షం/కోదాడ:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా కోదాడ కోర్టు ప్రాంగణంలో నిర్వహిస్తున్న బార్ అసోసియేషన్ క్రీడా పోటీలను సీనియర్ సివిల్ జడ్జి కె. సురేష్, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమర్ లు ఘనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది నిత్యం అధిక పనిభారంతో మానసిక శారీరక అలసటకు గురవుతుంటారని అన్నారు. ప్రతిరోజు కనీసం ఒక గంట పాటు వ్యాయమం లేదా ఏదైనా క్రీడలో పాల్గొనడం వల్ల ఆరోగ్య మెరుగుపడటమే కాకుండా, మానసిక ఉల్లాసం ఉత్సాహం పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోయేషన్ ఉపాధ్యక్షులు గట్ల నర్సింహరావు, జనరల్ సెక్రటరీ రాంశెట్టి రామకృష్ణ, జాయింట్ సెక్రటరీ జానిపాషా, ఖజాంబీ, కోదూరు వెంకటేశ్వర్లు, క్రీడల కార్యదర్శి వెంకటచలం, లైబ్రరీ కార్యదర్శి గాలి శ్రీనివాసనాయుడు, రంజాన్‌పాషా, బోడ్డుపల్లి శ్రీనివాస్, పెద్దబ్బాయి, సీనియర్ న్యాయవాదులు వై.సుధాకర్‌రెడ్డి, పాలేటి నాగేశ్వరరావు, సాదుశరత్‌బాబు పాల్గొన్నారు.






# పెండింగ్ స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదల చేయాలి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదల చేసి జీవో నెం. 9 ని రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలో బీసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డా. చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. పెండింగ్ స్కాలర్ షిప్‌లు, ఫీజు రియంబర్స్‌మెంట్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి బిజెపి నాయకులు మద్దతు తెలిపారు. ఈకార్యక్రమంలో బీసి సంక్షేమ సంఘం నాయకులు కోటేశ్వర్‌రావు, ఏరుకొండ రాము, భూతరాజు భరత్, జంగిటి మల్లేష్, నెల్లికంటి గోపి, యాదయ్య, గణేష్, లింగస్వామి, ఆనంద్‌గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# పిఆర్‌సి ప్రకటించాలి



**ప్రజాపక్షం/నకిరేకల్ :** పీఆర్‌సిని తక్షణమే ప్రకటించి, ఉపాధ్యాయవిద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) పిలుపు మేరకు తొలి దశ ఆందోళనలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో జీవో25 సవరణ,డిఎస్‌సి 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు,సీపీఎస్ రద్దు,పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏల విడుదల తదితర డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరారు.ఈఆందోళనలో యూఎస్‌పీసీ నాయకులు టి. నర్సింహమూర్తి,కె.విద్యాసాగర్ రెడ్డి కె.శ్రీనివాస్,ఈ.జగతి,పి. తిరుమలయ్య, ఈ. హరికృష్ణ,ఎం.మల్లేష్,పి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# చేనేత వస్త్రాలు ధరించి చేతివృత్తులను కాపాడాలి

**ప్రజాపక్షం/మునుగోడు** : చేనేత వస్త్రలు ధరించి చేతి వృత్తులను కాపాడాలని మునుగోడు ఎస్ఐ శోభన్ బాబు స్థానిక సర్పంచ్ పాలకూరి రమాదేవి అన్నారు. శుక్రవారం స్థానిక మునుగోడు శ్రీ భక్త మార్కండేయ దేవస్థాన ప్రాంగణంలో జరిగిన జాతీయ చేనేత దినోత్సవ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సిల్కు కాటన్ సంఘాల అధ్యక్షులు అవ్వారి భాస్కర్,సిలువేరు సుదర్శన్, సహకార సంఘాల పాలకవర్గ సభ్యులు మిరియాల సుభద్ర, రావిరాల కుమారస్వామి,గంజి నరేందర్, మిరియాల సత్తయ్య,సింగం వెంకటేశం,సంగిశెట్టి చంద్రకళ, కర్నాటి రాజు బొల్ల చంద్రకళ,సింగం సత్తయ్య గంజి రాజయ్య పాల్గొన్నారు.



# పట్టణ అభివృద్ధే ధ్యేయం



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సూర్యాపేట పట్టణ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామని, వెనుకబడిన వార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టి సమన్వయంతో సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని 25వ వార్డు కౌన్సిలర్ కోడి శిరీష శివ వార్డులోని ముత్యాలమ్మ గుడి సమీపంలో మున్సిపల్ జనరల్ ఫండ్ నిధుల ద్వారా మంజూరైన రూ.5లక్షల వ్యయంతో సిసి డ్రైన్ కల్వర్టుల నిర్మాణానికి వారు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఈనెల 15 లోపు నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరవుతాయన్నారు. సమగ్ర నివేదిక ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా దారిద్ర్యరేఖ దిగువన ఉన్న పేదలకు ఒక కోటి 5 లక్షల రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం త్వరలో శ్రీకారం చుడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, పట్టణ అధ్యక్షులు వెలుగు వెంకన్న, మున్సిపల్ కౌన్సిలర్లు నాగుల వాసు, గునగంటి హేమ సతీష్, కొణతం రాజేష్ రెడ్డి, పాలగాని మాధవి కృష్ణ, నాయకులు కోతి గోపాల్ రెడ్డి, ధరావత్ వీరన్న నాయక్, తంగెళ్ల కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

# మానవ హక్కులను పరిరక్షిస్తా : చిరంజీవి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మానవ హక్కుల రక్షణ, సామాజిక న్యాయం కోసం నిరంతరం శ్రమిస్తున్న మానవ హక్కుల పరిరక్షణ సంస్థ తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ చైర్మన్‌గా లింగంపల్లి చిరంజీవి బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం నాడు సంస్థ జాతీయ అధ్యక్షులు సింగమమాల వెంకటరమణయ్య, తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కిషోర్ కుమార్, డైరెక్టర్ సుబ్బారావులు లింగంపల్లి చిరంజీవికి అధికారిక నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ముఖ్య ప్రతినిధులు మాట్లాడుతూ సమాజంలో బాధితుల హక్కుల పరిరక్షణకు, సేవా కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడానికి లింగంపల్లి చిరంజీవి తన శక్తివంచన లేకుండా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం లింగంపల్లి చిరంజీవి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతను అప్పగించిన జాతీయ, రాష్ట్ర నాయకులకు రుణపడి ఉంటానని తెలిపారు. రాబోయే రోజుల్లో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 33 జిల్లాల్లో సంస్థ కమిటీలను విస్తరిస్తూ, మానవ హక్కుల పరిరక్షణ సంస్థను మరింత పునాదులతో బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దళిత క్రైస్తవులకు ఎస్‌సి హోదా కల్పించేంతవరకు పోరాడుదాం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** దళిత క్రైస్తవులకు ఎస్‌సి హోదా కల్పించేంతవరకు క్రైస్తవులందరూ ఐక్యమత్యంతో ఉద్యమించాలని యునైటెడ్ దళిత క్రిస్టియన్స్ ఫడరేషన్ జనరల్ సెక్రెటరీ పి.డేవిడ్ రాజ్,చీఫ్ అడ్వైసర్ తలకొప్పుల క్రిస్టాపర్ పిలుపునిచ్చారు.శుక్రవారం పట్టణంలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ కమ్యూనిటీ హాల్ లో జరిగిన సమావేశంలో యునైటెడ్ దళిత క్రిస్టియన్స్ ఫడరేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్‌సి హోదా కల్పించే పోరాటంలో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందని వారు తెలిపారు.గౌరవ సలహాదారు.ప్రొఫసర్ వి.నతనియెలు,చీఫ్ అడ్వైసర్.తలకొప్పుల క్రిస్టాపర్,అధ్యక్షుడు డిఐ సంసోన్,ఉపాధ్యక్షుడు జేపీ సాల్మన్ రాజు, జనరల్ సెక్రెటరీ,పి డేవిడ్ రాజు, ట్రెజరర్,ఆదిమల్ల ప్రభుదాసు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి ఎవినేజర్,జాయింట్ సెక్రెటరీ దుబ్బాసి ప్రేమ్ కుమారు, ఎగ్జిక్యూటివ్ నెంబర్‌లు బొంగరాల సమదానం, మద్దెల చంద్ర పాలు, అజర్య నాయక్. అడ్వైజర్ పి జేమ్స్ ఎన్నికయ్యారని వారు పేర్కొన్నారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా దళిత క్రైస్తవుల మీ ద జరుగుతున్న అక్రమ దాడులను అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత క్రైస్తవులు, పాస్టర్లు,సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# ఎస్‌టియుటిఎస్ ప్రత్యేక టెట్ స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** సెప్టెంబర్ నెలలో నిర్వహించనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు హాజరుకానున్న ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల ప్రయోజనార్థం ఎస్‌టీయూటీఎస్ రూపొందించిన ప్రత్యేక స్టడీ మెటీరియల్‌ను మండల విద్యాశాఖ అధికారి డి.ధర్మానాయక్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల ఉద్యోగ భద్రతను దృష్టిలో ఉంచుకుని ఎస్‌టీయూటీఎస్ రూపొందించిన ఈ స్టడీ మెటీరియల్ ఎంతో ఉపయోగకరంగా ఉందని,పరీక్షకు సిద్ధమవుతున్న ఉపాధ్యాయులకు ఇది మంచి మార్గదర్శిగా నిలుస్తుందని అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మురారిశెట్టి రమేష్,ఆర్థిక కార్యదర్శి కొనకంచి వెంకటేశ్వర్లు,మండల శాఖ అధ్యక్షుడు అంబటి వీరనారాయణ,ప్రధాన కార్యదర్శి వలిశెట్టి విజయభాస్కర్,జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు రమావత్ రామసింగ్,సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎన్.సురేష్ కుమార్,ఎం.నవీన్ కుమార్,త్రిపురారం మండల శాఖ అధ్యక్షుడు కడారు శ్రీనివాస్,తిరుమలగిరి సాగర్ మండల శాఖ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డిఎస్‌సిడిఓ, ఇడి ఎస్‌సి కార్పొరేషన్ అధికారిగా లత



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సూర్యాపేట జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి (డిఎస్‌సిడిఓ) కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా సేవలందిస్తున్న కె. లత జిల్లా డిఎస్‌సిడిఓగా, ఇడి ఎస్‌సి కార్పోరేషన్ అధికారిగా అదనపు బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో కూడా ఆమె సూర్యాపేట జిల్లా డిఎస్‌సిడిఓగా పూర్తిస్థాయి బాధ్యతలను నిర్వహించి మంచి గుర్తింపు పొందారు. ఇప్పుడు మరొకసారి ఆమె ఈ బాధ్యతలను చేపడుతుండటం పట్ల పలువురు అధికారులు, సిబ్బంది, ప్రజాసంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు ఆమెకు పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

# దోమల నివారణకు చర్యలు చేపట్టాలి

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** మున్సిపాలిటి పరిధిలో దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రగతిశీల మహిళ సంఘం పిఓడబ్ల్యూ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిళ నాయకులు మాట్లాడుతూ పట్టణంలోని 15వ వార్డులో డ్రైనేజీలలో నీరు నిల్వ ఉండి చెట్లు పెరిగి దోమలు అధికంగా ఉన్నాయన్నారు. దోమలతో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ సీజనల్ వ్యాధులు ప్రబలి ప్రజలు అనారోగ్య బారీన పడే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పివోడబ్ల్యూ జిల్లా కమిటి సభ్యురాలు, డివిజన్ కార్యదర్శి చందన బోయిన లక్ష్మి, హుజూర్‌నగర్ డివిజన్ ఉపాధ్యక్షులు సయ్యద్ రేష్మా, శ్యామల, మండల అధ్యక్షురాలు మరియమ్మ, పట్టణ అధ్యక్షురాలు మల్లేశ్వరి, చెన్నమ్మ పాల్గొన్నారు.

# విద్యార్థి నిరుద్యోగ సభను విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/మునగాల:** విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్ హాస్టల్ విద్యార్థుల సమస్యలు, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఈనెల 9వ తేదీన మండల పరిధిలోని బరాఖత్‌గూడెం గ్రామంలో నిర్వహిస్తున్నట్లు ఈ సభకు ముఖ్య అతిథులుగా బిసి సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ర్యాగ అరుణ్ కుమార్ హాజరవుతున్నట్లు బిసి విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్, బిసి సేన జాతీయ కార్యదర్శి డాక్టర్ నరాల రుక్మారావు, బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలంపల్లి సుధాకర్‌గౌడ్‌లు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని బరాఖత్‌గూడెం వారు విలేకరులతో మాట్లాడారు. విద్యార్థుల, నిరుద్యోగల అత్మబలిదానాలు చేసుకుని తెలంగాణ రాష్ట్రం సాధించుకుంటే ఈ రోజు విద్యార్థులకు ఫీజు బకాయిలు చెల్లించకపోవడం వల్ల కళాశాల యాజమాన్యాలు డబ్బులు వసూలు చేస్తున్నారని అలాగే నిరుద్యోగులకు నిరుద్యోగ బృతి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ సభకు విద్యార్థులు, నిరుద్యోగులు అత్యధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# స్కూల్ డైరీల పంపిణీ

**ప్రజాపక్షం/నడిగూడెం:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు డాక్టర్ ముత్తు స్కూల్ డైరీలను శుక్రవారం స్థానిక ఎస్ఐ తేజస్విని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిలుకూరు మండలం కట్టకొమ్ముగూడెం గ్రామానికిచెందిన వేముల ముత్తు మిజోరం సెంట్రల్ యూనివర్శిటిలో ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తూ విద్యా అవశ్యకతను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు దాతృత్వంతో ముందుకు వచ్చి స్కూల్ డైరీలను అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దున్న శ్రీనివాస్, ఎఎస్ఐ శ్రీనివాసరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు కత్తి వెంకటేశ్వర్లు, షేక్ మీరాజుద్దీన్, ఎండి మౌలాన, అశోక్‌గౌడ్, బి.వెంకటేశ్వర్లు, జుట్టు కొండ నవీన్, వేపూరి పర్వతాలు పాల్గొన్నారు.





## కార్మికుల పాత్ర కీలకం

**ప్రజాపక్షం/హాలియా:** ఆరోగ్యకరమైన మున్సిపాలిటీ గా రూపాంతరం చెందడంలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమని మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం హాలియా మున్సిపాలిటీలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బందికి పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్మెంట్ (పీపీఈ) వస్తువులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ చంద్రారెడ్డి మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా,ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడంలో మున్సిపల్ సిబ్బందిదే కీలక పాత్ర అని తెలిపారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి,కౌన్సిలర్ దేపావత్ ప్రసాద్ నాయక్, కోఆప్షన్ సభ్యులు రషీద్,నకిరేకంటి సైదులు,మజాహర్,కడమంచి శ్రీను పాల్గొన్నారు.

## అవగాహన కార్యక్రమం



**ప్రజాపక్షం/రామన్నపేట :** బోగారం గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుకోవాలనే లక్ష్యంతో నాలుగు రకాల చెత్తబుట్టల వినియోగంపై గ్రామ సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామప్రజలకు చెత్తను వేరు చేసి,సరైన చెత్తబుట్టలో వేయడం అలవాటు చేసుకోవాలని అవగాహన కల్పించారు.తడిచెత్త,పొడి చెత్త తదితర వ్యర్థాలను వేరు చేయడం ద్వారా గ్రామాన్ని పరిశుభ్రంగా,పచ్చగా మరియు ఆరోగ్యకరంగా ఉంచుకోవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బైకాని ఉమా మహేష్ యాదవ్,వార్డు మెంబర్లు నేరటి మానస సురేష్ యాదవ్, మేడి ఆంజనేయులు,కనుక మల్లేష్,చిరగోని శిల్ప,నవీన్ యాదవ్ పాల్గొన్నారు.

## రామన్నపేట బిజెపి మండల కార్యవర్గ సమావేశం

**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట బిజెపి మండల అధ్యక్షులు బండ మధుకర్ రెడ్డి అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నకరికంటి మొగులయ్య మండల ఇన్చార్జి కొరివి శంకర్ పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఇస్తున్న నిధుల ద్వారానే గ్రామ పంచాయతీలు నడుస్తున్నాయని,అలాగే అభివృద్ధి కార్యక్రమాలలో కేంద్ర ప్రభుత్వం సహకారంతోటే మౌలిక వసతులు అనేది జరుగుతున్నది రాష్ట్ర ప్రభుత్వ నిధులు అనేది గ్రామపంచాయతీలకు ఇప్పటివరకు ఒక రూపాయి కూడా విడుదల చేయకపోవడం సిగ్గుచేటు చర్యగా వర్ణిస్తూ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వనం అంజయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కట్ట యాదయ్య, ఏళ్ల సంజీవరెడ్డి, సీనియర్ నాయకులు దోగుపర్తి సుభాష్, షానగుండ భిక్షమాచారి,జల లక్ష్మీ నారాయణ,రాపోలు స్వామి,మండల ప్రధాన కార్యదర్శి జంగిలి సత్యనారాయణ పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారంలో జాప్యం చేయొద్దు



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు జాప్యం చేయవద్దని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ శుక్రవారం మండల మహిళా సమాఖ్య భవనంలో జరిగిన మండల జనరల్ బాడీ సమావేశంలో అన్నారు. వన మహోత్సవం సందర్భంగా ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ బాలునాయక్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలు, పెండింగ్ పనులు ఎదురవుతున్న సమస్యలను అధికారుల ద్వారా తెలుసుకొని పలు సూచనలు చేశారు. గ్రామాలలో నెలకొన్న త్రాగు నీరు, సిసి రోడ్లు, డ్రైనేజి, విద్యుత్ అంతరాయాలు, పాఠశాలల మౌలిక వసతుల కొరత పలు సమస్యలపై సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు ఎంఎల్ఏ దృష్టికి తీసుకువచ్చారు. ఈకార్యక్రమంలో ఎంపిడివో స్వర్ణలత, ఎంఈవో నాగేశ్వర్ రావు, ఎంపివో సురేందర్, పిఏసిఎస్ చైర్మన్ డా. వేణుధర్‌రెడ్డి, నాయిని మాధవరెడ్డి, ఏపిఎం యాదయ్య, పంచాయతీ కార్యదర్శి డాకునాయక్, సర్పంచ్ పసునూరి యుగేందర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

**మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం**

మహిళా సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని గౌరికుంట తండా, గుడితండాలలో నూతనంగా నిర్మించిన మహిళా సమాఖ్య భవనాలను ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధికి, మహి ళా స్వాలంభనకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందన్నారు.



## ఆసుపత్రి ఉంది ... డాక్టర్ ఎక్కడో?

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండల కేంద్రంలో పశు వైద్యశాల రైతులకు ఉపయోగం లేకుండా మారిందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆసుపత్రి ఉన్న డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరోగ్యానికి గురైన ఆవులు, గేదెలు, దూడలు, గొర్రెలు, మేకలను వ్యయ ప్రాయాసలతో ఆసుపత్రికి తీసుకువచ్చిన చికిత్స చేసే డాక్టర్ లేక గంటల తరబడి ఎదురు చూసి చివరకు నిరాశతో వెనుతిరుగుతున్న పరిస్థితి నెలకొంది. లక్షల రూపాయలు వెచ్చించి పశుసంపదను పెంచుకుంటున్న రైతులకు కనీస వైద్య సేవలు అందకపోవడం దురదృష్టకరమని వాపోతున్నారు. పశువుల డాక్టర్ విధుల్లో క్రమం తప్పకుండా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, లేకపోతే రైతు సంఘాలతో కలిసి ఆందోళనకు దిగాల్సి వస్తుందని సిపిఐ, రైతు సంఘాల నాయకులు హెచ్చరించారు. ప్రస్తుతం వర్షాకాలంలో పశువులకు వివిధ రకాల వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో అత్యవసర వైద్య సేవలు అవసరమైన అధికారులు తమ చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రి పై కనీసం ఆసుపత్రి అనే పేరు బోర్డు కూడా లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. వెంటనే పేరు బోర్డు కూడా ఏర్పాటుచేసి అవసరమైన వసతులు కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



## దేవాలయం చోరీ కేసులో నిందితుడి అరెస్టు




**ప్రజాపక్షం/హాలియా:** హాలియాలోని శ్రీ పార్వతీ సమేత జడల రామలింగేశ్వర స్వామి దేవాలయం లో జరిగిన హుండీ చోరీ కేసు నిందితున్ని పోలీసులు పట్టుకొని రిమాండ్ పంపినట్లు ఎస్ఐ సాయి ప్రశాంత్ తెలిపారు. సంఘటనకు సంబంధించిన వివరాలు శుక్రవారం పత్రికా విలేకరులకు వివరించారు.ఈనెల మూడవ తేదీ రాత్రి శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి ఆలయంలో గల హుండీని దొంగిలించి అందులో ఉన్న నగదును గుర్తు తెలియని వ్యక్తి అపహరించారు. దీనిపై ఆలయ కమిటీ చైర్మన్ చెరుపల్లి ముత్యాలు ఇచ్చిన ఫిర్యాదుతో గుడిలో జరిగిన దొంగతనం తాలూకు సమాచారాన్ని నిపుణుల సహాయంతో విచారణ ప్రారంభించామన్నారు. శాస్త్రీయ సాంకేతిక,సిసి టీవీ ఫుటేజీల,క్లూస్ టీం ఆధారాల ఆధారాలతో దొంగతనానికి పాల్పడిన నిందితుడిని గుర్తించారు.ఈనెల 7వ తేదీన అనుముల గ్రామ శివారులోని ద్వారకపురి ఆర్చి వద్ద నిర్వహించిన వాహన తనిఖీల సందర్భంగా అనుమానాస్పదంగా తిరుగుతున్న గంజి వెంకటేష్ (33)ను అదుపులోకి తీసుకొని విచారించడంతో ఈ కేసు లో నేరం చేసినట్లు ఒప్పుకున్నాడు. దేవరకొండకు చెందిన గంజి వెంకటేష్ వద్ద హుండీలో దొంగిలించిన 1000 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడు మద్యం, వ్యక్తిగత అవసరాల కోసం దేవాలయాలను లక్ష్యంగా చేసుకొని హుండీ చోరీలకు పాల్పడుతున్నట్టు వెల్లడైంది. ప్రస్తుత కేసుతో కలిపి నిందితుడి మీద మొత్తం ఐదు కేసులలో ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో తేలింది.నిందితుడిని న్యాయస్థానం ముందు హాజరు పరచగా జ్యుడీషియల్ రిమాండ్ కు పంపించినట్లు ఎస్ఐ సాయి ప్రశాంత్ చెప్పారు.

## విబి జి రామ్ జి ఉద్యోగుల వంటావార్పు

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** విబిజి రాంజీ ఉద్యోగులు గత వారం రోజుల నుండి చేస్తున్న పెన్డౌన్, షట్ డౌన్ సహాయ నిరాకరణ కార్యక్రమంలో భాగంగా మోటకొండూరు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ముందు ఉద్యోగులు వంట వార్పు కార్యక్రమం నిర్వహించారు. తమ న్యాయమైన కోరికలను పరిష్కరించాలని ఉన్నతాధికారులను కోరారు ఈ కార్యక్రమంలో ఈసీ గోవర్ధన్, టిఎలు స్వామి, చంద్రమోహన్, మంగ, సిఓలు సిద్దిమల్లేష్, అలివేలు మంగ తదితరులు పాల్గొన్నారు.






## అధ్యాపకుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :**అధ్యాపకుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అల్ ఇండియా ఫడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ కాలేజ్ టీచర్స్ ఆర్గనైజేషన్ అధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో అధ్యాపకులు పల కార్డులు పట్టుకొని ధర్నా నిర్వహించారు.ఈసందర్భంగా టిజిసిటిఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అనిల్ అబ్రహం మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా అధ్యాపకుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని వాటి వెంటనే పరిష్కరించడానికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో డాక్టర్ పరంగి రవికుమారు,బత్తిని నాగరాజు,డాక్టర్ అంతటి శ్రీనివాసులు, డాక్టర్ డి. మునిస్వామి,డాక్టర్ వెల్దండి శ్రీధర్,సి. జ్యోత్స్న,మల్లేశం, శివరాణి, హబీబ్ జాని తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

## మెగా హెల్త్ క్యాంప్ సందర్శన



**ప్రజాపక్షం/భువనగిరి :** కుంభం ఫౌండేషన్ చైర్‌పర్సన్ కుంభం కీర్తి రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని, భువనగిరి పట్టణ 22వ వార్డు కౌన్సిలర్ జాలిగాం విఘ్నేష్ ఆధ్వర్యంలో దివ్య ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంపు భువనగిరి ఎమ్మెల్యే శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి సందర్శించారు. ఈ మెగా హెల్త్ క్యాంప్లో నీలాద్రి హాస్పిటల్, అభినవ్ కంటి దవాఖాన వైద్య బృందాలు ప్రజలకు ఉచిత వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షలు అందించడంతో పాటు రక్తదాన శిబిరాన్ని కూడా నిర్వహించాయి. ఈ సందర్భంగా పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. వైద్య శిబిరంలో అందిస్తున్న సేవలను ఎమ్మెల్యే పరిశీలించి వైద్యులను, నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణిరవికుమార్, మున్సిపల్ వైస్ చైర్పర్సన్ పోతంశెట్టి మంజులవెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తీ, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ శ్రీరేఖబాబురావు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## మంత్రి చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ చేనేత అవార్డు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా రాష్ట్ర ప్రభుత్వం కొండా లక్ష్మణ్ బాపూజీ పేరిట అందజేస్తున్న ఉత్తమ చేనేత అవార్డు 2026కు గాను యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మున్సిపాలిటీ కి చెందిన సీత సుధాకర్ ఉత్తమ చేనేత డిజైనర్ గా అవార్డు అందుకున్నారు. శుక్రవారం పీపుల్స్ ప్లాజాలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. మంత్రి శ్రీ సీతక్క స్పెషల్ చీఫ్ సెక్రటరీ హ్యాండ్లూమ్ అండ్ టెక్స్టైల్స్ సవ్యసాచి గోష్ స్పెషల్ సెక్రటరీ హ్యాండ్లూమ్ అండ్ టెక్స్టైల్ శ్రీ కాత్యాయినీ సమక్షంలో మంత్రి నగదు పురస్కారంతోపాటు జ్ఞాపికను అందజేసి మరిన్ని కళాకృతులను నూతన వరవడితో వినియోగదారులను ఆకర్షించేలా డిజైన్లను తయారు చేయాలని కోరారు.

## వాహనదారుల భద్రతే లక్ష్యం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి వెంట వాహనదారులకు అవగాహన కల్పించేలా, ప్రమాదాల తీవ్రతను వివరిస్తూ పలు ప్రాంతాల్లో శుక్రవారం హెచ్చరిక, సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు, వాహనదారులలో చైతన్యం తెచ్చేందుకు జాతీయ రహదారిపై ఈ సైన్ బోర్డులను అమర్చాం. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి. పిల్లలకు వాహనాలు ఇవ్వడం చట్టరిత్యా నేరం, తీవ్ర ప్రమాదకరమన్నారు. తల్లిదండ్రులు ఈ విషయంలో బాధ్యతాయుతంగా ఉండాలన్నారు

## ప్రతిభ గల క్రీడాకారులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తాం



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** రాబోయే రోజుల్లో గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభ గల క్రీడాకారులను వెలికితీయడమే లక్ష్యంగా మోగా మోడ్రన్ కబడ్డీ టోర్నమెంట్ నిర్వహిస్తామని జిల్లా మోడ్రన్ కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మోర్తాల నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల నూతన కమిటిని ఎన్నుకున్నారు. గరిడేపల్లి మండల అధ్యక్షులుగా చాగంటి వీరయ్య, ప్రధాన కార్యదర్శిగా చాటల సైదులు, కోశాధికారిగా సోంపంగు లెనిన్, గౌరవ అధ్యక్షులుగా నందిపాటి సైదులు, ఉపాధ్యక్షులుగా చామకూరి గురుస్వామి, బి. సత్యనారాయణరెడ్డి, సహయ కార్యదర్శిగా మామిడి హుస్సేన్, సంధ్యల బక్కయ్య,సభ్యులుగా నర్సింహ, షేక్ జాని, పంగ వీరస్వామి, షేక్ జాని లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పెండెం అజిత్, కానుగు సైదులు, నందిపాటి పృద్వీ పాల్గొన్నారు.

## సిసి కెమెరాలతో నేరాలు తగ్గుముఖం



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** సీసీ కెమెరాలతో నేరాలు తగ్గుముఖం పడతాయని యాదగిరిగుట్ట రూరల్ సీఐ శంకర్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని దిలావర్పూర్‌లో ప్రముఖ వ్యాపారవేత చామకూర శశిధర్ రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన 10 సీసీటీవీ కెమెరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ కోసం సీసీటీవీల ద్వారా గ్రామాలలో 24/7 నిఘా ఉంటుందని, దొంగతనాలు,రోడ్డు ప్రమాదాలు, గొడవలు వంటి సంఘటనలను అరికట్టడంతో పాటు, ఏదైనా సంఘటన జరిగినప్పుడు సాక్ష్యంగా ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మోటకొండూర్ ఎస్సై డి.అశోక్, సర్పంచ్ గోలను అంజనేయులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ చేనేత దినోత్సవం

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** జాతీయ చేనేత దినోత్సవాన్ని చౌటుప్పల్ మండలంలోని నేలపట్ల,ఎస్.లింగోటం. మునిసిపల్ కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చౌటుప్పల్ చేనేత సహకార సంఘం కార్యాలయం ఎదుట అధ్యక్షుడు బడుగు మోహన్‌బాబు సొసైటీ జెండాను ఎగరవేశారు. మునిసిపల్ చైర్‌పర్సన్ మోగుదాల పావనిరమేష్ గౌడ్,వైస్ చైర్మన్ గోశిక వినయ్‌కుమార్, నాయకులు బడుగు లక్ష్మయ్య పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలోని సూర్యాపేట పారిశ్రామిక సహకార సంఘ భవనంలో చేనేత పతాకావిష్కరణ అధ్యక్షులు గండూరి రమేష్ నిర్వహించారు. అనంతరం చేనేత కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత వృత్తికి ఎంతో చరిత్ర కలిగి ఉన్నదని అన్నారు. 1905 ఆగష్టు 7న ఎందరో మహానుభావులు విదేశీ వస్త్రాలు వద్దు స్వదేశీ వస్త్రాలు ముద్దు అనే నినాదంతో ఆనాడు విదేశీ వస్త్రాలను కాల్చివేశారని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో 110 సంవత్సరాల తర్వాత కేంద్ర ప్రభుత్వం అధికారికంగా 2015 ఆగష్టు 7న జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికుల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో చేనేత వృత్తి కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షులు కడారి బిక్షం, రిటైర్డ్ ప్రొఫెసర్ విపూరి సుదర్శన్, కౌన్సిలర్ నాగుల వాసు, దూలం నగేష్, పున్నం వెంకటేశ్వర్లు, చిలివేరు నరసింహారావు, భీమనపల్లి వెంకటేశ్వర్లు, ముశం హరిప్రసాద్, పెద్ది శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వాల బాధ్యత



**ప్రజాపక్షం/భువనగిరి :** ఏ దేశమైనా, ఏ రాష్ట్రమైనా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వాల ప్రధాన బాధ్యత. అది ప్రభుత్వ రంగంలోనే కాదు, ప్రైవేట్ రంగంలోనూ ఉండాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాల పరిస్థితి, ఐటీ రంగం, పెట్టుబడులు, పరిశ్రమలు, రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం క్షీణతపై బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి భువనగిరిలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ వనరులే అత్యంత విలువైన సంపద యువశక్తిని సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం చేసినప్పుడే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఏ ప్రభుత్వం అయినా ఎక్కువ మొత్తంలో ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వలేదు. కాబట్టి, ప్రైవేటు రంగంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం పై ప్రత్యేక శ్రద్ధ వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ రైతుబంధు అధ్యక్షులు, పెద్దలు కొల్పుల అమరేందర్, భువనగిరి పార్టీ టౌన్ అధ్యక్షులు ఎవి కిరణ్, టౌన్ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, భువనగిరి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పెద్దలు కిష్టయ్య, మాజీ ఎంపీపీ రమేష్, మాజీ జెడ్పీటీసీ సందేలా సుధాకర్, మాజీ కౌన్సిలర్ ఇట్టబోయిన గోపాల్, భువనగిరి మండల ప్రధాన కార్యదర్శి నీల ఓం ప్రకాశ్ గౌడ్, వెంకట్ పాల్గొన్నారు.

## చీదెళ్ల ఆలయంలో నిత్య నైవేద్యాలు



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండలంలోని చీదెళ్ల గ్రామంలో శతాబ్ధ కాలం నుండి కొలువై ఉన్న శ్రీ లక్ష్మి తిరుపతమ్మ గోపయ్య స్వామి దేవాలయ ప్రాంగణంలో నిత్య నైవేద్య కార్యక్రమానికి ఆలయ కమిటి శ్రీకారం చుట్టింది. ఆలయ ఆవరణలో వేంచేసి ఉన్న ఉప దేవతలైన అంకాలమ్మ తల్లి, గంగమ్మ తల్లి, నాగదేవత, సీతారామాంజనేయ స్వామి వార్లకు ఇకపై నిరంతరాయంగా నిత్య నైవేద్య సమర్పణ, పూజలు నిర్వహించాలని ఆలయ కమిటి శుక్రవారం నిర్ణయించినట్లు గ్రామ సర్పంచ్ వరికల్లు పద్మ శ్రీనివాస్, దేవాలయ కమిటి చైర్మన్ రణబోతు శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ కీర్తి యలమంచయ్య గౌడలు తెలిపారు. ఈ విషయమై ఆలయ అర్చకులు గోపయ్య స్వామితో కమిటి ప్రతినిధులు చర్చించి శ్రావణ మాస మొదటి శుక్రవారం ఈనెల 14 నుండి ప్రారంభించనున్నట్లు వివరించారు. ఈ మహత్కార్యానికి భక్తులు, దాతలు తమకు తోచిన ఆర్థిక సహాయాన్ని అందించి సహకరించాలని భక్తులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దేవరం ప్రభాకర్ రెడ్డి, కమిటి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## పిఆర్‌సిని ప్రకటించి అమలు చేయాలి

**ప్రజాపక్షం/చింతపల్లి :** పాఠశాలల, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించి, ఆగస్టు 15వ తేదీలోపు పిఆర్సిని అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ( టిఎస్‌యుటిఎఫ్) జిల్లా కార్యదర్శి గేర నర్సింహ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండల వ్యాప్తంగా సభ్వత్వ నమోదు కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కొరకు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పిలుపు మేరకు నాలుగు ధశల పోరాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి పాఠశాల విధులకు హాజరై, భోజన విరామ సమయంలో తమ న్యాయమైన డిమాండ్లు సాధన కొరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు కాశిరెడ్డి కృష్ణారెడ్డి, కోట్ల యాదగిరి, చింతపల్లి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిలువేరు నారాయణ, ముసుగు ఆనంద్ బాబు, కోశాధికారి ఇరిగి స్వామి, సీనియర్ నాయకులు ఎర్ర శ్రీరాములు, దొడ్డి నరసింహ, నాంపల్లి మండల అధ్యక్షుడు జింకల సత్యనారాయణ పాల్గొన్నారు.

## చేయూత

**ప్రజాపక్షం/రామన్నపేట :** ఇటీవల అనారోగ్యంతో కాటం నరసింహ మరణించగా టిఆర్ఎస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు, టియుఎఫ్ మైనార్టీ సెల్ కన్వీనర్,హంస ఫౌండేషన్ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ చాంద్ వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు.అనంతరం 50 కిలోల బియ్యం, రూ.2500 నగదు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కాటం నరసింహ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. మైనార్టీ నాయకులు మహమ్మద్ జానీ, మల్లం సైదులు,కాటం రమేష్, కాటం నిర్మల మరియు వారి కూతురు మమత తదితరులు పాల్గొన్నారు.





## దశదిన కర్మ కార్యక్రమం

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ మునిసిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామానికి చెందిన ముస్కు సురేందర్‌రెడ్డి దశదిన కర్మ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెలికంటి సత్యం,ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిలు పాల్గొన్నారు.మండలంలోని దామెర గ్రామ పరిధిలోని బాలాజీ పంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించారు.నల్లగొండ జిల్లా డిసిసిబి మాజీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి స్వయాన మామ కావడంతో రాజకీయ నేతలు పాల్గొని సురేందర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలర్పించారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పున్న కైలాస్‌నేత, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య,కాంగ్రెస్ నాయకలు పబ్బు రాజు,బాలు మహేందర్,వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్‌రెడ్డి,కాంగ్రెస్ మండల అధ్యక్షులు బోయ దేవేందర్ పాల్గొన్నారు.

## రాష్ట్ర ట్రేడర్స్ సెల్ కార్యవర్గ సభ్యులుగా కందుకూరి చల్మయ్య

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ట్రేడర్స్ సెల్ కార్యవర్గ సభ్యులుగా యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు,కందుకూరి చల్మయ్య నియమితులైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా కందుకూరి చల్మయ్య మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి రాష్ట్ర స్థాయిలో సేవ చేసే అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర ట్రేడర్స్ సెల్ కన్వీనర్ డా.ఉప్పల శారద, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ ,జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్,రాష్ట్ర నాయకులు పాశం భాస్కర్,తన నియామకానికి సహకరించిన జిల్లా, మండల నాయకులు, సీనియర్ నాయకులు, బూత్ అధ్యక్షులు, వివిధ మోర్చాల పదాధికారులు, పార్టీ కార్యకర్తలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## కోతుల స్వైర విహారానికి బోన్లతో చెక్



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** కోతుల బెడదతో హడలిపోతున్న జనానికి రక్షణగా పోచంపల్లి మున్సిపాలిటీ సిబ్బంది చర్యలు చేపట్టింది. కోతుల ఆవాసాలు తీవ్రంగా సంచరించే సమస్యలను కలిగించే స్థలాల వద్ద మున్సిపాలిటీ సిబ్బంది బోన్లను ఏర్పాటు చేసి ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలను చేపట్టారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల సీతవానిగూడెం ఇంకా అనేక సమస్యాత్మక ప్రాంతాలలో కోతుల స్వైర విహార నివారణకు ఏర్పాట్లు చేశారు. కోతుల బెడద రోజు రోజుకి తీవ్రమవుతున్న నేపథ్యంలో పురపాలక ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్న సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కమిషనర్ సిబ్బంది తీసుకున్న చర్యలతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరిన్ని బోన్ లు ఏర్పాటు చేసి పూర్తిగా కోతుల బాధ నుండి విముక్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సైన్స్ కిట్స్ సామాగ్రిని సద్వినియోగం చేసుకోవాలి

## సైన్స్ కిట్స్ పంపిణీ




**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మోటకొండూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆక్షన్ ఎయిడ్ సంస్థ ద్వారా స్టెమ్ ల్యాబ్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆక్షన్ ఎయిడ్ ప్రోగ్రామ్ లీడ్ డాక్టర్ ఇర్ఫాన్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని అన్నారు. ఇందుకోసం సైన్స్ పట్ల అవగాహన కల్పించేందుకు ఆక్షన్‌ఎయిడ్ సంస్థ కృషి చేస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజా గోపాల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, భాగ్యశ్రీ, విశ్వరూపం, రాజశేఖర్ రెడ్డి , విద్యార్థులు పాల్గొన్నారు.



## ఎస్‌బిఐ మిని బ్యాంక్ ప్రారంభం

ప్రజాపక్షం/గుండాల; యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం తుర్లపాడుపురం గ్రామంలో ఎస్బిఐ ఆధ్వర్యంలో బ్యాంక్ కస్టమర్ సర్వీస్ పాయింట్ (మిని బ్యాంక్)ను శుక్రవారం ఎస్బిఐ మేనేజర్ శ్రీనివాస్, సర్పంచ్ కునగళ్ల లిల్లీ గణేష్‌లు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్బిఐ సేవలు శుక్రవారం నుండి గ్రామంలో ప్రారంభమయ్యాయని గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాలు కూడా ఈ సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో పే పాయింట్ మేనేజర్ రాజు, దశరథగుప్త, మల్లేశం, సాయి ప్రసాద్, గణేష్, మల్లేష్, అనిల్, వీరస్వామి, మధు, ప్రమ్ చంద్, మహేష్, ప్రవీణ్, పే పాయింట్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుడికి అండగా బీర్ల ఫౌండేషన్

ప్రజాపక్షం/గుండాల; యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వెల్మజాల గ్రామానికి చెందిన వికలాంగుడైన సింగారపు రమేష్ ఇల్లు లేకుండా పూరి గుడిసెలో అనాధగా ఉంటూ జీవనం సాగిస్తున్న విషయం తెలుసుకున్న ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈరసారపు యాదగిరి గౌడ్ బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం వికలాంగుడైన రమేష్‌కు సొంత ఇంటిని నిర్మించి ఇస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈకార్యక్రమంలో జిల్లా నాయకులు రాంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు దశరథ గుప్త, వెంకన్న, సర్పంచ్ ఐలయ్య, ఉప సర్పంచ్ సాయి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



ప్రజాపక్షం/డిండి; సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని పలువురు వక్తలు పేర్కొన్నారు. డిండి జడ్పి హెచ్ఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన లింగిరి సత్యనారాయణ అచ్చమ్మ దంపతుల ఉద్యోగ విరమణ అభినందన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ విరమణ పొందిన లింగిరి సత్యనారాయణ అచ్చమ్మ దంపతులును అధికారులు, ఉపాధ్యాయులు, నాయకులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. 29 ఏళ్ల పాటు ఉపాధ్యాయుడిగా సత్యనారాయణ విద్యార్థులను ఉన్నత స్థాయికి తీర్చిదిద్దారని కొనియాడారు.

## చేనేత కార్మికులకు సన్మానం

ప్రజాపక్షం/నకిరేకల్ : చేనేత జాతీయ దినోత్సవ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ నకిరేకల్ సెంటిన్నియల్ క్లబ్ తరుపున నకిరేకల్ లోని చీమలగడ్డ కాలనీ లో గల చేనేత కార్మికులను శుక్రవారం సన్మానించడంజరిగింది.ఇట్టి కార్యక్రమానికి చైర్మన్ లయన్ పాస్ట్ జోన్ చైర్మన్ రావిరాల అశోక్,సెంటన్నియల్ క్లబ్ ప్రెసిడెంట్సూదిరెడ్డి బాబు రెడ్డి,సెక్రటరీ యానాల రాంరెడ్డి,పాస్ట్ ప్రెసిడెంట్ కంధాల ప్రేమనాథ్ రెడ్డి,క్లబ్ సభ్యులు,ఆదిరాల ప్రవీణ్,కొడిదల శ్రీనివాస్,అల్లుబెల్లి విజయ్ కుమార్ రెడ్డి,చాట్ల నగేష్ ,నిమ్మల సైదులు,చేనేత సంగం అధ్యక్షులు రాపోలు నగేష్,ముషం శ్రీను పాల్గొన్నారు.



## సమగ్ర అభివృద్ధికి అధికారులు, సర్పంచులు పనిచేయాలి



ప్రజాపక్షం/త్రిపురారం: గ్రామాల సమగ్ర అభివృద్ధికి సంబంధిత అధికారులు, స్థానిక సర్పంచులు తోడ్పడాలని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ కోరారు.మండల కేంద్రంలో ఉన్నటువంటి మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి అధికారి విజయ కుమారి ఆధ్వర్యంలో శుక్రవారం జనరల్ బాడీ నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు అభివృద్ధి పథంలో నడవాలంటే అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తే సరిపోతుందన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం,తాగునీటి సరఫరా,వీధి దీపాల నిర్వహణ, పచ్చదనం పెంపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టించాలని సొరించాలని సర్పంచ్లకు తెలిపారు. అంతేకాకుండా ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌ను సంబంధించిన అధికారులు శాలువాలతో సన్మానం చేసి పుష్పగుచ్ఛం అందజేశారు.ఈకార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ లీల, తహసిల్దార్ గాజుల ప్రమీల, ఎంపిడీవో విజయ్ కుమారి,మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యం, పిఎసిఎస్ చైర్మన్ జయరాం నాయక్,మండల విద్యాధికారి రవి నాయక్ పాల్గొన్నారు.

## పురం జానయ్యకు బెస్ట్ సినిమాటోగ్రాఫర్ అవార్డు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: కృషి, పట్టుదలతో పనిచేస్తే ఏ రంగంలోనైనా అత్యుత్తమ గుర్తింపు సాధించవచ్చని నేను సైతం ఛాయాచిత్ర ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రామకృష్ణచారి పేర్కొన్నారు. మండలంలోని గోగువారిగూడెం గ్రామానికి చెందిన పురం జానయ్య ప్రతిష్ఠాత్మక బెస్ట్ ఆఫ్ ది సినిమాటోగ్రాఫర్ అవార్డుకు ఎంపికయ్యారు. నేను సైతం ఛాయాచిత్ర ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇటీవల గోవా కేంద్రంగా మూడు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ సినిమాటోగ్రఫీ వర్క్‌షాప్‌లో జానయ్య తన ప్రతిభను చాటుకున్నారు. ఈ వర్క్‌షాప్‌లో ఆయన ప్రదర్శించిన అత్యుత్తమ ప్రతిభకు గాను బెస్ట్ ఆఫ్ ది సినిమాటోగ్రఫీతో పాటు ది బెస్ట్ డ్రోన్ ఆపరేటర్‌గా ఎంపికై ఈ అవార్డును సొంతం చేసుకున్నారు.ఈ సందర్భంగా గోవాలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రామకృష్ణ చారి చేతుల మీదుగా జానయ్య ప్రశంసా పత్రంతో పాటు మెమెంటోను అందుకొని ఘన సత్కారం పొందారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి అంతర్జాతీయ స్థాయి వేదికపై ప్రతిభ చూపి అవార్డు సాధించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఫోటోగ్రాఫర్లు సిద్దార్థ శ్రీనివాస్, రమణశ్రీ, పలువురు సినీ రంగానికి చెందిన నిపుణులు, నిర్వాహకులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు ప్రతి నెలా సకాలంలో వేతనాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు హరికిషన్ రావు డిమాండ్ చేశారు.శుక్రవారం విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా యన మాట్లాడుతూ రాష్ట్రంలో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పూర్తి సమయం పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలో నూతనంగా చేరిన ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు స్వాగతం పలుకుతూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.నూతన కమిటీలో అధ్యక్షుడిగా హరికిషన్ రావు,ఉపాధ్యక్షురాలిగా ఉమాదేవి, ప్రధాన కార్యదర్శిగా విష్ణు, కోశాధికారిగా సరిత,కార్యవర్గ సభ్యులుగా ఐయితరాజు శంకర్,విక్రం,నోషిన్,ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.శేఖర్ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షురాలు నిర్మల,జిల్లా కోశాధికారి పి. నాగయ్య, ఇతర ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రతినిధుల పట్ల ఎమ్మెల్యే వివక్ష తగదు



ప్రజాపక్షం/చౌటుప్పల్: ఎంపిగా,ఎమ్మెల్యేగా,ఎమ్మెల్సీగా పని చేసిన కూడా మునుగోడు ఎమ్మెల్యేకు కనీసం ప్రజాసమస్యలపై అవగాహన లేదు.కేంద్రం నుండి వచ్చిన ఉపాధిహామీ నిధుల కేటాయింపులో ఎమ్మెల్యే బిజెపి ప్రజాప్రతినిధులు ఉన్న గ్రామాల్లో కేటాయించకుండా అధికారులపై వత్తిడి చేయడం తగదు.ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వైఖరి మార్చుకోకపోతే గ్రామాల్లో తిరగనియ్యమంటు బిజెపి కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.బిజెపి గెలుపొందిన గ్రామాల్లో నిధులు కేటాయించకుండా వివక్ష చూపుతున్నారని ఆరోపిస్తూ చౌటుప్పల్ మునిసిపల్,మండలం , సంస్థాన్ నారయణపురం మండలంలోని ఆయా గ్రామాల్లోని బిజెపి ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు శుక్రవారం చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయం ముట్టడి చేశారు.ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర నాయకులు గంగిడి మనోహర్ రెడ్డి,కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మునుగోడు నియోజకవర్గంలో ఉన్న బిజెపి ప్రజాప్రతినిధులకు నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు.మతిస్థిమితం లేని వ్యక్తిగా మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడని విమర్శించారు.రాజగోపాల్‌రెడ్డి అధికార పక్షమా లేక ప్రతిపక్షమా అనే సందేహంతో నియోజకవర్గ ప్రజలు ఉన్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నల్లగొండ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్‌రెడ్డి,రాష్ట్ర నాయకులు దోనూరి వీరారెడ్డి,దూడల భిక్షం,జిల్లా ఉపాధ్యక్షులు శాగ చంద్రశేఖర్‌రెడ్డి,మండల అధ్యక్షులు కైరంకొండ ఆశోక్,సుర్వి రాజు,మునిసిపాలిటీ అధ్యక్షులు కల్పన,నాయకులు బాతరాజు సత్యం పాల్గొన్నారు.



## బిసి హక్కుల సాధన సామాజిక న్యాయ సభ విజయవంతం చేయండి

ప్రజాపక్షం/దేవరకొండ; బిసి ఇంటలెక్ట్యువల్స్ ఫోరం ఆధ్వర్యంలో ఆగస్టు 09 ఆదివారం నల్గొండ పట్టణంలోని చిల్లకాయన గర్‌లోని జీవీఎల్ గార్డెన్స్‌లో నిర్వహించనున్న బీసీ హక్కుల సాధన సామాజిక న్యాయ పోరాట సభను విజయవంతం చేయాలని శుక్రవారం పిలుపునిచ్చారు. శుక్రవారం దేవరకొండలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడుతూ ఆగస్టు 09న జరిగే సభకు బీసీ సంఘాల నాయకులు, మేధావులు, యువత, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభకు ఐఏఎస్ అధికారి. టి. చిరంజీవులు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. ఈ సమావేశంలో నియోజకవర్గ బిసిఐఎఫ్ ఇంచార్జ్ బొమ్మ శ్రీనివాస్, బిసి ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం నాయకుడు మధు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు బుచ్చయ్య, శ్రీనివాస్, మల్లేష్, శ్రీను, రామ్, సత్యనారాయణ, సైదులు, కిరణ్ పాల్గొన్నారు.

## పట్టణ పారిశుద్ధ్యం, వ్యర్థాల శుద్ధి మెరుగుదలే లక్ష్యం

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మున్సిపాలిటీలో పట్టణ పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు, వ్యర్థాల శుద్ధిని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు డంపింగ్ యార్డ్ ఆధునీకరణ పనులను వేగవంతం చేశారు. ఇందులో భాగంగా మున్సిపల్ చైర్మన్ చిలుకూరు సుధా బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రీజరెడ్డి స్థానిక వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బందితో కలిసి శుక్రవారం స్థానిక డంపింగ్ యార్డ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. యార్డ్‌కు కొత్తగా వచ్చిన ఆధునిక యంత్రాల పనితీరును, అందుబాటులోకి తెచ్చిన పరికరాలను వారు ప్రత్యక్షంగా పరిశీలించి సమీక్షించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ అత్యంత ఆధునిక పరికరాలు ఒక నెల రోజుల్లోగా పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చి పనిచేయడం ప్రారంభిస్తాయని తెలిపారు. అదేవిధంగా మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం స్వయం సహాయక సంఘాల మహిళలు చేపట్టిన యూనిఫాం కుట్టు పని కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీజ రెడ్డి పరిశీలించారు. వస్త్రం నాణ్యతను, నిర్దేశిత లక్ష్యాలను, ఇప్పటివరకు జరిగిన పని పురోగతిని ఆమె అడిగి తెలుసుకుని పరిశీలించారు. నిర్దేశిత సమయంలోగా నాణ్యమైన యూనిఫాంలను సిద్ధం చేయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు.

## యువతను విస్మరిస్తే మనుగడ ప్రశ్నార్థకం

ప్రజాపక్షం/చింతపల్లి : ప్రభుత్వాలు యువతని విస్మరిస్తే వాటి మనుగడ ప్రశ్నార్థకమేనని అందుకు ఉదాహరణ ఢిల్లీలో జరుగుతున్న పరిణామాలే నిదర్శనమని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారీ వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని నారాయణరావు భవన్లో శుక్రవారం వెంకటరత్నం అధ్యక్షతన జరిగిన ఏఐవైఎఫ్ 16వ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పేపర్ల లీకులు, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండులక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు అవకాశాల కల్పన కోసం నూతన పరిశ్రమలను నెలకొల్పాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో సిపిఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, సహాయ కార్యదర్శి అంజల్‌రావు, లక్ష్మయ్య, వెంకటచారి, మిడిదొడ్డి రామకృష్ణ, బాధరాజు, నేనావత్ కృష్ణ, భీనమోని వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.





## ఉచిత మెగా ఆరోగ్య శిబిరం విజయవంతం

**ప్రజాపక్షం/మర్రిగూడ:** గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని సర్పంచ్ లపంగి నర్సింహాతెలిపారు. మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఆధ్వర్యంలో ఉచిత మెగా ఆరోగ్య శిబిరం నిర్వహించారు.శిబిరంలో బీపీ,షుగర్ పరీక్షలు నిర్వహించడంతో పాటు వైద్యుల సలహాలు అందించి,అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ లపంగి నర్సింహా పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పొగాకు సైదులు,గ్రామ శాఖ అధ్యక్షుడు కారింగ్ నరసింహ పాల్గొన్నారు.

## 11న మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** ఈనెల 11మంగళవారం మధ్యాహ్నం 2:00 గంటలకు మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించబడుతుందని ఎంపీడీవో ఉమేష్ కుమార్ తెలిపారు.ఈ సమావేశానికి ప్రభుత్వ విప్,నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం ముఖ్య అతిథిగా పాల్గొంటారని సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు పాల్గొనవలసిందిగా తెలిపారు.

## చేయూత పెన్షన్ల కోసం అర్హులు దరఖాస్తు

**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్:** మండల పరిధిలో చేయూత పెన్షన్‌కు అర్హులైన వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కే.వెంకటయ్య కోరారు.పంచాయతీరాజ్ శాఖ,జిల్లా కలెక్టర్,జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఆదేశాల మేరకు గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈమేరకు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు,ప్రజాప్రతినిధులు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చేయూత పెన్షన్‌కు అర్హులైన వారు ఓటరు గుర్తింపు కార్డు,రేషన్ కార్డు,ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, సదరం ధ్రువీకరణ పత్రం (వర్తించే వారికి), నిర్ణీత దరఖాస్తు ఫారం, పాస్‌పోర్టు సైజు ఫో, విడాకుల ధ్రువీకరణ పత్రం (అవసరమైతే),స్థానిక తహసీల్దార్ ధ్రువీకరణ తదితర అవసరమైన పత్రాలను జతచేసి తమ గ్రామ పంచాయతీ కార్యాలయం లేదా మండల పరిషత్ కార్యాలయంలో నేరుగా దరఖాస్తు సమర్పించాలని కోరారు.

## నాయకత్వం అంటే బాధ్యత, క్రమశిక్షణ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నాయకత్వం అంటే కేవలం పదవి మాత్రమే కాదని, అది బాధ్యత, క్రమశిక్షణ, నిజాయితీ, సేవాభావంతో కూడుకున్నదని మిర్యాలగూడ రూరల్ సీఐ పి.ఎన్.డి. ప్రసాద్ అన్నారు. పట్టణంలోని ఢిల్లీ వరల్డ్ స్కూల్‌లో నూతన విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇన్వెస్టిచర్ సెరిమనీ కార్యక్రమాన్ని శుక్రవారం అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా ఎంపికైన విద్యార్థి నాయకులకు బ్యాడ్జ్‌లు, సాష్‌లను ప్రదానం చేసి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.

## ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



**ప్రజాపక్షం/నాంపల్లి:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని,దేశంలో పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను తక్షణమే అరికట్టాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్. అంజయ్య చారి డిమాండ్ చేశారు.శుక్రవారం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో మండల కార్యవర్గ సభ్యుడు కోరే సత్తయ్య అధ్యక్షతన మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజయ్య చారి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతూ బద్లావ్ జరూరీ హై మార్పు కావాలి అనే నినాదంతో సెప్టెంబర్ 1న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 10న నాంపల్లి మండలానికిసిపిఐ ప్రజా చైతన్య జీపు జాతా చేరుకునే సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల నుంచి సుమారు 100 బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి సుదనబోయిన రమేష్,సహాయ కార్యదర్శి నేతాళ్ల రాజు,మండల కార్యవర్గ సభ్యులు ఊరిపాక వెంకటయ్య,నేరెళ్ల సైదులు,దండిగా వెంకటయ్య, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి చెన్నోజు వెంకటాచారి,రేవెల్లి సర్పంచ్ బట్టు శ్రీను,నాయకులు గిరిస్వామి,కానుగుల మహేష్,బుషిపాక ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ ఉపకార వేతనాలు విడుదల చేయాలి



**ప్రజాపక్షం/నాంపల్లి:** విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు,ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ నాయకులు కళాశాల విద్యార్థులతో కలిసి శుక్రవారం నాంపల్లిలో ర్యాలీ నిర్వహించారు.అనంతరం మానవహారం చేపట్టి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు నాలుగు సంవత్సరాలకు సంబంధించిన రూ.11 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపించారు. వాటిని విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి అన్నెపాక అనిల్, కాటిక ప్రేమ్ కుమార్,సాయితేజ,అంతోని రాజ్,రెహమాన్,అనూష్,శ్రీహర్షిత,మనీషా,ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

## బకాయిలు చెల్లించకపోతే సచివాలయం ముట్టడిస్తాం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రంలో కళాశాల బహిష్కరించి భారీ ర్యాలీ,రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్ధన్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయకపోవడం వల్ల పేద, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు.గత నాలుగు నెలలుగా విద్యార్థి సంఘాలు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గజ్జి అజయ్ కుమార్ యాదవ్,బీసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కన్నబోయిన రాజు యాదవ్, నాయకులు కొంపల్లి రామన్న గౌడ్, పొ గాకు రవి కుమార్ యాదవ్,మల్లబోయిన తరుణ్ కుమార్,అనంత నాగరాజు గౌడ్, అంబటి శివకుమార్, గడగోజు విజయాచారి పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటానికి సిద్ధం



**ప్రజాపక్షం/వేములపల్లి** :కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలులో పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్ రావు అన్నారు.శుక్రవారం పార్టీ కార్యాలయం లో మండల అధ్యక్షులు పెద్దమం భారత్ ఏర్పాటు చేసిన ముఖ్య సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలలో భాగంగా ఒక్క హామీ కూడా అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని అన్నారు , పార్టీ కార్యకర్తలు ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ ప్రతి గ్రామంలో బిజెపి పార్టీని ప్రతిష్ట చేసుకోవాలని, గ్రామాలలో బిజెపి పార్టీ కమిటీలను ఏర్పాటు చేసుకొవాలని దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు బంటు సైదులు ఎడ్ల రమేష్ కుమార్.కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు చాలామంది సీతారాం రెడ్డి,మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి పందిరి భాగ్యమ్మ,బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు పెదమాం ప్రసాద్,మండల కార్యదర్శిలు చింతకాయల సైదులు,బేకరీ ప్రసాద్ రెడ్డి,చక్కని ఉపేందర్,మానపురి పురుషోత్తం రెడ్డి,మాతంగి ప్రభాకర్ ,తదితరులు పాల్గొన్నారు.



## 15 అంశాలపై చర్చ

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక అధికారి వేణుగోపాల్,ఎంపీడీవో మున్నయ్య ఆధ్వర్యంలో మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖలకు సంబంధించిన 15 అంశాలపై సమీక్ష నిర్వహించి పలు తీర్మానాలు చేశారు.ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస ఎస్ఐఆర్,భూ రీసర్వే తదితర అంశాలపై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు.సమావేశంలో పలువురు సర్పంచులు మాట్లాడుతూ రైతు వేదికల ద్వారా యూరియా యాప్‌కు సంబంధించిన ఎస్ఎంఎస్‌లు అందరికీ పంపకుండా తమకు నచ్చిన రైతులకు మాత్రమే పంపుతున్నారని ఆరోపించారు. దీంతో అర్హులైన అనేక మంది రైతులకు యూరియా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా పంపిణీలో పూర్తి పారదర్శకత పాటించాలని కోరారు.ఈ సమావేశంలో ఎంఈఓ శారద,ఎంపీఓ రవికుమార్,వ్యవసాయ అధికారి సహస్,పశువైద్యాధికారి సురేందర్,ఏపీఓ వెంకటేష్,అంగన్‌వాడీ సూపర్వైజర్ యశోద, పంచాయతీ కార్యదర్శులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## విఓ భవన నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలోని ఖుదాబక్ష్‌పల్లి గ్రామంలో వివాదాస్పదంగా మారిన 188 గజాల గ్రామకంఠ భూమిలో శుక్రవారం వీవో (విలేజ్ ఆర్గనైజేషన్) భవన నిర్మాణానికి ట్రైనీ కలెక్టర్ వివేక్ శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) తరుణ్ చక్రవర్తి, గ్రామ సర్పంచ్ జయలక్ష్మి పాండు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ వివేక్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం చేపడుతున్న భవన నిర్మాణ పనులకు ఎవరైనా అడ్డంకులు సృష్టించే ప్రయత్నం చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు.కార్యక్రమం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ దూది రాజు,ఎస్ఐ రాంబాబు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.అధికారులు భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## లింగయ్యకు వేముల వీరేశం నివాళి

### కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి

**ప్రజాపక్షం/నకిరేకల్(కట్టంగూర్):** మండలంలోని నారెగూడెం గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు బాషపాక లింగయ్య అకాల మరణం పట్ల ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.గ్రామానికి చేరుకున్న వీరేశం బాషపాక లింగయ్య పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మనోధైర్యం చెప్పారు.ఈ సందర్భంగామాట్లాడుతూ బాషపాక లింగయ్య గ్రామ వార్డు సభ్యునిగా ప్రజలకు విశేష సేవలు అందించారని, గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. మృతుడు బాషపాక లింగయ్య కుమారుడు బాషపాక చంద్రశేఖర్ ప్రస్తుతం డీఆర్‌డీఏ కార్యాలయంలో అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్‌గా విధులు నిర్వహిస్తుండటంతో పాటు తెలంగాణ రాష్ట్ర సెర్ప్ మాదిగ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్‌గా సేవలందిస్తున్నారు.

